క్లుప్తంగా

'నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు'


జెండావెంకటాపూర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్

లక్సెట్టిపేట: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అమ్మాలని, ఎటువంటి ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. జెండావెంకటాపూర్‌లో పర్యటించి నూతనంగా నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను, గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలాలు చూశారు. కార్యక్రమంలో డీఏవో కల్పన, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఏఈఓ శృతి, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, డీఎల్‌పీవో ఫణీందర్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా సిబ్బందితో వాగ్వాదం

మందమర్రిరూరల్: మందమర్రి జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా సిబ్బందితో నాలుగు రోజుల క్రితం బీఆర్‌ఎస్ యువ నాయకుడు టోల్‌ట్యాక్స్ చెల్లింపు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. బెల్లంపల్లి వైపు నుంచి వచ్చే సమయంలో నాయకున్ని టోల్‌ప్లాజా సిబ్బంది ట్యాక్స్ చెల్లించాలని కారు ఆపడంతో, యువనాయకుడికి కోపం వచ్చినట్లుంది. సిబ్బందితో నన్నే ట్యాక్స్ అడుగుతావా అంటూ.. నిన్ను ఉద్యోగంలో పెట్టించింది ఎవరు.. నేను తెలియదా అంటూ చిర్రుబుర్రులాడాడు. ఈ సంఘటనా నాలుగు రోజుల క్రితం జరిగినట్లు తెలియగా గురువారం పలు వాట్సాప్ గ్రూపుల్లో వీడియో వైరల్ అయ్యింది.

విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి తీసుకోవాలి

కాసిపేట: వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ వారందరూ విద్యుత్ శాఖ ఏఈల నుంచి లోడ్‌కు అనుకూలంగా రుసుం చెల్లించి తగు జాగ్రత్తలు వహిస్తూ విద్యుత్ కోసం అనుమతి పొందాలని మండల విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. 1000వాట్స్ లోడ్ వరకు రూ.1560, 1000నుంచి 1500లోడ్‌కు రూ.2300, 1500నుంచి 2000వాట్స్ రూ.3020, 2000 వాట్స్ కన్న ఎక్కువ లోడ్‌కు రూ.3020తో పాటు అదనంగా ప్రతి వెయ్యి వాట్స్‌కు రూ.1560చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎవరు కూడా లైన్‌లకు కొక్కి వేసి విద్యుత్ వాడకానికి ప్రయత్నించరాదని, ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని దగ్గర ఉన్న పోల్ నుంచి విద్యుత్ సౌకర్యం పొందాలన్నారు.

'మత్తుకు అలవాటు పడితే జీవితాలు నాశనమే'

మంచిర్యాలక్రైం: యవత మత్తుకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ.చక్రపాణి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ పరవర్తన్ కార్యక్రమంలో భాగంగా యాంటి డ్రగ్స్, ర్యాగింగ్ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు మాదక ద్వ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల నుంచి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యాంటి డ్రగ్స్, ర్యాగింగ్ కమిటీ నోడల్ అధికారి డాక్టర్ ఎంవీ పట్వర్ధన్, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమాచారి దీక్షకు గల్ఫ్ సంక్షేమ సంఘం మద్దతు


దీక్షలో కూర్చున్న సంఘం నాయకులు

జన్నారం: మండల కేంద్రానికి 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో సామాజిక వేత్త భూమాచారి చేపట్టిన నిరహార దీక్షకు గురువారం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ.. మండల రైతులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి ఆటంకం కలుగకుండా, 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ హసన్, సలహాదారుడు మగ్గిడి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య, నాయకులు సురేశ్, అక్బర్, సుధాకర్, లక్ష్మణ్, అంజన్న, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలో పొలాల అమావాస్య పండుగను నేతకానీలు ఘనంగా నిర్వహించారు. పూర్వీకుల ఆచారం ప్రకారం అమావాస్యకు ఒక్కరోజు ముందు పురుషులు వ్యవసాయంలో వాడే ఎడ్లను, స్త్రీలు మట్టితో తయారు చేసిన పాత్రలను ఏర్పాటు చేసి పశువులను అలంకరించుకొని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లిస్తారు.

భీమారం: మండలంలోని గ్రామాల్లో పొలాల అమావాస్య పండుగని రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఎడ్లను నీటితో కడిగి వాటిని అలంకరించి పూజలు నిర్వహించారు.

నెన్నెల: మండలంలో పొలాల అమావాస్యను రైతులు ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయంలో రైతులకు అండగా నిలిచే ఎద్దులను అలంకరించి పూజించారు. ఎద్దులను పసుపు, కుంకుమ, పూల దండలతో అందంగా అలకరించి గ్రామాల్లో ఊరేగించారు. ఇళ్లల్లో పిండి వంటలు చేసి పశువులకు నైవేద్యంగా సమర్పించారు. మట్టితో ఎడ్ల ప్రతిమలను చేసి పూజించారు.

వేమనపల్లి: మండలంలో ఏ గ్రామంలో చూసిన పొలాల అమావాస్య సందడి నెలకొంది. ఇంటింటా పిండి వంటలు చేసుకొని ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. హారతులు ఇచ్చి నైవేద్యం పెట్టారు. జంజెర్ల పూలు, మామిడి ఆకులతో ఇంటికి తోరణాలు కట్టారు. మట్టితో ఎడ్ల విగ్రహాలు చేసి పూజలు చేశారు.


వేమనపల్లి: ఎద్దుకు హారతి పడుతున్న భక్తులు

కాసిపేట: మండలంలోని రేగులగూడ ఆదివాసీలో పొలాల పండుగను పురస్కరించుకొని ఆదివాసీలు గ్రామ పొలిమేరలో ఉన్న దేవత వద్ద నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రోడ్డుపై సహపంక్తి భోజనాలు చేశారు. కొత్త బట్టలు ధరించి కోలాటాలు ఆడుతూ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ఊరేగింపు నిర్వహించి దేవతలకు పూజలు చేశారు.


వ్యవసాయ పనిముట్లకు పూజలు


కాసిపేట: రోడ్డుపై భోజనాలు చేస్తున్న ఆదివాసీలు


నెన్నెల: ఆవుకు నైవేద్యం సమర్పిస్తూ..

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు చట్టాలతో పాటు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి, ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, ఏజీపీ పద్మ, న్యాయ


మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

వాదులు అక్కల శ్రీధర్, ఆర్ ప్రకాశం, తాజోద్దీన్, గణేష్, మల్లికార్జున్, రవిరాజు, పాఠశాల డైరెక్టర్ డాన్ డొమెనిక్, ప్రిన్సిపాల్ జోషెఫ్ పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య తీర్చడంలో విఫలం'

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య ఉన్నా పరిష్కరించడంలో పాలక ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ విమర్శించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ, గ్రామాల్లో 12రోజుల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఏ మాత్రం చలనం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల బాధను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మున్సిపాలిటీలో వీధి వ్యాపారులపై కమిషనర్ ప్రతాపం చూపడాన్ని తీవ్రంగా విమర్శించారు. సమావేశంలో సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, మండల కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం ముట్టడి

లక్సెట్టిపేట: మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ జాయింట్ యాక్షన్ కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా ముట్టడించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా, అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్, రమణారెడ్డి, లక్ష్మి, నస్రీన్‌బేగం, పద్మ, రాజేశ్వరి, కళావతి పాల్గొన్నారు.


కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్యకర్తలు

బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాలటౌన్: గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతిని చెల్లిస్తామని ఇచ్చిన హామీ, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేస్తున్న దీక్షను రాష్ట్ర ప్రభుత్వం భగ్నం చేసేందుకు ప్రయత్నించడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీజేవైఎం, బీజేపీ నాయకులు గురువారం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన శాంతియుతంగా దీక్ష చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అక్రమంగా అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తుల అంజనేయులు, పట్టి వెంకటకృష్ణ, పానుగంటి మధు, గాదె శ్రీనివాస్, అనిరిషెట్టి రాజు, కొండ నరేశ్, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, గాజుల ప్రభాకర్, రవనవేని శ్రీనివాస్, బోయిని దేవేందర్, బింగి సత్యనారాయణ, పచ్చ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

నస్పూర్: పట్టణ పరిధిలోని 5వ వార్డుకు చెందిన కంబాల శంకరయ్య ఇంటిలో బుధవారం వంటగ్యాస్ సిలీండర్ గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఇంటిపై కప్పు రేకులు పగలి పోయి, ఇంటిలో సామగ్రి కాలిపోయిన విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి రూ.7000నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి మొగిళి, కొండ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తాండూర్: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేశారు.

బీజేపీలో చేరిక

దండేపల్లి: మండలంలోని చింతపల్లికి చెందిన పలువురు గురువారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

'గణేశ్ నవరాత్రులకు డీజే అనుమతి లేదు'

బెల్లంపల్లి: వినాయక నవరాత్రులకు డీజే అనుమతి లేదని ఏ ఒక్కరు కూడా నిబంధనను అతిక్రమించొద్దని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య కోరారు. బెల్లంపల్లిలోని పద్మశాలీ భవన్‌లో గురువారం వినాయక ఉత్సవ కమిటీ, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా వ్యవహరించాలని సూచించారు. వినాయక నవరాత్రుల వేడుకల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమరుపాటుగా వ్యవహరించొద్దన్నారు. ప్రమాదాలకు చోటివ్వొద్దని పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. పర్యావరణానికి విఘాతం కలుగకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్టించడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎవరి వద్ద కూడా బలవంతంగా చందాలు వసూలు చేయొద్దని, దౌర్జన్యం చేసినట్లైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిమజ్జనస్థలం పరిశీలన

వినాయకుడి విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని పోలీసు అధికారులతో కలిసి ఏసీపీ సదయ్య పరిశీలించారు. ఏ.ఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లే మార్గంలో ఉన్న పోచమ్మ చెరువు నిమజ్జన స్థలాన్ని సందర్శించి కావాల్సిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలతో నిమజ్జన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య, బెల్లంపల్లి రూరల్, తాండూర్ సీఐలు ఎస్.రాజ్‌కుమార్ గౌడ్, శ్రీనివాసరావు, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, నరేష్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సీఐ, ఎస్సైలకు సూచనలు చేస్తున్న ఏసీపీ సదయ్య

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలతో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి ఫారెస్ట్ కమ్యునిటీ హాల్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ పోలీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే పోలీస్‌స్టేషన్‌లో లేదా డయల్ 100లో సంప్రదించాలన్నారు. మంచిర్యాల పట్టణ ఇన్స్‌పెక్టర్ రాజు, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, లక్సెట్టిపేట సీఐ కృష్ణ, పలువురు ఎస్సైలు, పలు మండపాల ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి రెడ్డి

నస్పూర్/లక్సెట్టిపేట/జైపూర్/జన్నారం: గణేశ్ నవరాత్రోత్సవాలలో భాగంగా మండపాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, లక్సెట్టిపేట సీఐ క్రిష్ణ, ఎస్సై లక్ష్మణ్, జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు, జన్నారం ఎస్సై సతీశ్,సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండపాల ఏర్పాటు కోసం అనుమతి పొందడానికి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ వారి అనుమతి పొందాలన్నారు. రాత్రి పది గంటల తర్వాత తోటి వారికి ఇబ్బంది కలుగకుండా శబ్దాలు చేయొద్దని సూచించారు. నిమజ్జనం సమయంలో డీజేలు ఉపయోగించొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి


వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమబోర్డు అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టోలో పెట్టాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మేనిఫేస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబును టీపీపీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు దాసారపు శ్రీనివాస్ కలిసి వినతిపత్రం అందించారు. ఆయన వెంట నాయకులు చీమ శ్రీనివాస్, మహేష్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

పొంగిప్రవహిస్తున్న వాగులు

భీమారం: మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. భీమారం సమీపంలోని గొల్లవాగుప్రాజెక్ట్‌లోకి భారీగా వచ్చి చేరుతున్న వరద నీళ్ల మత్తడి దూకి జోడువాగుల ద్వారా వెళ్లి గోదావరి నదిలో కలుస్తున్నాయి.

చెన్నూర్‌రూరల్: వర్షాలకు మండలంలోని కత్తెరసాల, నారాయణపూర్, రాయిపేట, సుద్దాల, బుద్దారం, సంకారం గ్రామాల సమీపాల్లోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంట చేళల్లో వర్షపు నీరు చేరింది.



మందుబాబులకు అడ్డాగా మినీ ట్యాంక్‌బండ్

- రాత్రి వేళల్లో మందుబాబుల హల్‌చల్

చెన్నూర్: మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రూ.6కోట్ల నిధులతో పెద్ద చెరువుపై నిర్మించిన మినీ ట్యాంక్‌బండ్ చెన్నూర్‌కే అందాన్ని తీసుకొచ్చింది. సాయంత్రం వేళల్లో ఆ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ట్యాంక్‌బండ్‌ను మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారింది. కోట్లాది నిధులతో నిర్మించిన ట్యాంక్‌బండ్‌ను అధికారులు విస్మరించడంతో, మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో మినీట్యాంక్ బండ్‌పై మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారని పట్టణ ప్రజలు అంటున్నారు. ఎంట్రెన్స్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా, సీసీ కెమెరాలకు చిక్కకుండా మందుబాబులు ట్యాంక్‌బండ్ చివరి ప్రాంతంలో మందుతాగి బాటిళ్లను వదిలేసి వెళ్తున్నారు. కొందరు మద్యం ఖాళీ బాటిళ్లను చెరువులో వేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మినీట్యాంక్ బండ్ పై పారిశుధ్యం లోపించకుండా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి, యువకులు ఆ ప్రాంతంలో మద్యం తాగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మద్యంతాగి అక్కడే పడేసిన మద్యం బాటిళ్లు

■ బొగ్గుబాయి వార్తలు

అధికారికి ఘన సన్మానం


సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్: కార్పొరేట్ జనరల్ మేనేజర్ (సర్వే) పీఎస్‌కే రవికుమార్ మొదటి సారిగా శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన సందర్భంగా ఆయనను గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ పీఓ శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ రైల్వే సైడింగ్ మెయింటెనెన్స్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపలి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ తెలిపారు. సీహెచ్‌పీపై సంఘం నాయకులతో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, బాపు, సది, వంసీ ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మంచిర్యాలఅర్బన్: టెట్ పరీక్ష నిర్వహణలో కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ టీపీయుపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఓయూజేఏసీ కో–ఆర్డినేటర్ మల్లేష్ డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌లో పొరపాట్లు ఉంటే, వెంటనే సరిచేసి పరీక్షకు అనుమతించాలని కోరారు. పరీక్షల్లో అవకతవకలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు.

'మట్టి వినాయక ప్రతిమలనే నెలకొల్పాలి'

మందమర్రిరూరల్: గణేశ్ నవరాత్రోత్సవాల్లో భక్తులు నెలకొల్పే వినాయక మండపాల్లలో మట్టి విగ్రహాలనే నెలకొల్పాలని ఏరియా పర్యావరణ అధికారి ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో ఏరియా జీఎం మనోహర్ చేతుల మీదుగా ఈ నెల 16న ఉదయం పదిన్నరకు ఉచితంగా సీఈఆర్ క్లబ్, కళ్యాణిఖని ఓసీ, రామకృష్ణాపూర్ ఓసీలో భక్తులకు మట్టి విగ్రహాల పంపిణీ జరుగుతుందని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'నా దేశం– నా మట్టి'

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో బీజేపీ ఆధ్వర్యంలో 'నా దేశం– నా మట్టి' కార్యక్రమంలో భాగంగా నాయకులు మట్టిని సేకరించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సొత్కు సంజీవరావు, నాయకులు వెంకటేశ్, గర్ల రవి, దిలీప్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మనోహర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక అక్షరాస్యతపై ఆటాపాట

జైపూర్: మండలంలోని ఇందారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎంవి.రూరల్ ఫోక్‌అర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా కళాజాత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కళాకారులు బ్యాంకు స్కీమ్స్, బ్యాంకు పథకాలు, పలు రకాల రుణాలపై ఆటాపాట ద్వారా వివరించారు.

ఘనంగా హిందీ దివస్

దండేపల్లి: హిందీ దివస్ వేడుకలను దండేపల్లి మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు హిందీ అక్షరమాలతో ప్లకార్డు ప్రదర్శన నిర్వహించారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన విశ్రాంత హిందీ పండిట్ లక్ష్మీరాజంను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ఓటరు నమోదుపై అవగాహన

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఓటరు నమోదుపై తహసీల్దార్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొలాల అమావాస్యను పురస్కరించుకుని గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుంత సౌభాగ్య, వైకుంఠం దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, ముక్తా శ్రీనివాస్, కటకం హరీష్, చంద్రశేఖర్, వంశీకృష్ణ, వెంకటేశ్, మహేశ్, పడకంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

మంచిర్యాలఅర్బన్: సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతబూని మోకాళ్లపై నిల్చొని నినాదాలు చేశారు.

మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావుకు సన్మానం

మంచిర్యాలటౌన్: మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు గురువారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్ట్రాటజీ కమిటీకి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన్ను జిల్లా కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం బలభద్రపాత్రుని శంకర్‌రావు మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బెల్లంపల్లి: మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు బెల్లంపల్లి కాంగ్రెస్ శ్రేణులు ఆత్మీయ సన్మానం చేశారు. ప్రేమ్‌సాగర్‌రావు వ్యూహ రచన కమిటీ చైర్మన్‌గా గురువారం గాంధీభవన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌కు తరలివెళ్లి ఘనంగా సన్మానించారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్

మందమర్రిరూరల్: అభయ్ యాప్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్స్‌ను గురువారం మందమర్రి ఆటోలకు సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్‌తో కలిసి అంటించారు. గత నెల 21న ఆటో డ్రైవర్స్‌కు అభయ్ యాప్‌పై అవగాహన కల్పించగా, 150మంది ఆటో డ్రైవర్స్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఆటోలకు స్టిక్కర్స్ అంటించినట్లు తెలిపారు. ప్రయాణంలో భద్రత ఉంటుందని, ప్రతి మహిళా ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఆర్థికసాయం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలో షెడ్ నిర్మాణం కోసం రూ.15వేలను బింగి సాయి ప్రసన్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు బింగి పోషం కళావతి ఆర్థిక సాయం అందించారు.